క్లుప్తంగా

ఎన్నికలకు హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

బోట్‌క్లబ్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యలు, సందేహాలు, ఫిర్యాదుల పరిష్కారానికి హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణపై బుధవారం ఆయన ఎన్నికల అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు 24 గంటలూ పనిచేసేలా మూడు షిఫ్టులలో 12 మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నా, సందేహాలు ఉన్నా హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్ 0884-2349400 సమాచారం అందజేయవచ్చునన్నారు.

జేసీకి మత్స్యకారుల వినతి



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ పరిసర ప్రాంతాల్లో మత్స్యకారుల అభివృద్ధిలో ఓఎన్‌జిసి సీఎస్ఆర్ నిధులుతో చేపట్టాల్సిన పలు సమస్యలపై కాకినాడ సముద్రతీర ప్రాంత మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. కాకినాడ దుమ్ములపేట, గోలీలపేట రూరల్ మండలం వలసపాకల, ఏటిమొగ, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచిస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, వాసిపల్లి కృష్ణ, బి.రామకృష్ణ, పినపోతు సత్తిబాబు, బ్రహ్మానందం, లంకే ధర్మారావు, ఆకుల గంగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వయోలిన్ కచేరీ



వయోలిన్ కచేరీ చేస్తున్న పేరి త్యాగరాజు

బోట్‌క్లబ్: సరస్వతీ గాన సభ 120వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సూర్యకళా మందిరంలో హైదరాబాద్‌కు చెందిన పేరి త్యాగరాజు వయోలిన్ కచేరీ ఆకట్టుకుంది. కర్ణాటక సంగీతంలో ప్రమోద్ ఉమాపతి వేణువుపై, హిందుస్తానీ సంగీతం జుగల్బంది ఆహూతులను ఆనంద డోలికల్లో ముంచేసింది. హంసధ్వని రాగంలో వాతాపి గణపతింభజే ప్రారంభించి అమృతవర్షిణితో పాటు పలు రాగాల కలయికతో స్వరఝరి విన్యాసం పోటాపోటీగా వాయించి ప్రేక్షకులను అలరించారు. వీరికి మృదంగంపై రామకృష్ణ, తబలాపై ఎస్.ఉదయ్‌కుమార్ చక్కటి సహకారాన్ని అందించారు.

కేసీబీఎస్‌తో మెరుగైన సేవలు



సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి

బోట్‌క్లబ్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (కేసీబీఎస్) అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సూర్య కళా మందిరం ఆవరణలోని కేవీఆర్‌కే ఆడిటోరియంలో బుధవారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశాన్ని అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తితో పాటు డైరెక్టర్లు ప్రారంభించారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సంస్థ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ కేసీబీఎస్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసి సంస్థ పురోగతికి పాటుపడాలని కోరారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీ ప్రసాద్, లావణ్య, ముత్తా మధు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

కరప: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ వి.సూరిబాబు తెలిపిన కథనం మేరకు గొడ్డటిపాలేనికి చెందిన యాళ్ల ఈశ్వరరావుకు కరపలో ఉంటున్న అతని సోదరి చింతా విజయలక్ష్మి కుమార్తె దేవితో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఈశ్వరరావు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కొంతకాలంగా ఈశ్వరరావు, దేవిల మధ్య మనస్పర్థలు ఉన్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఉదయం కరపలో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వచ్చేసింది. ఇంతవరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం పరిసర గ్రామాల్లోను, బంధువులు, స్నేహితుల ఇళ్లవద్ద గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో దేవి తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

సొంతింటి కల సాకారం

- గురజనాపల్లిలో 581 మందికి ఇళ్లస్థలాలు
- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో స్థల సేకరణ
- 4.5 ఎకరాల్లో జగనన్న లే అవుట్



గురజనాపల్లిలో జగనన్నకాలనీ మ్యాప్



గురజనాపల్లిలో పట్టాలిచ్చిన లే అవుట్ ఇదే

కరప: పేదలందరికీ ఇళ్ల స్థలాలిచ్చి, సొంతింటికల సాకారం చేయాలనుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో నియోజకవర్గ పరిధిలో 32 వేల మందికి పట్టాలిచ్చారు. కరప మండల పరిధిలో 23 గ్రామాల్లో 6,173 మందికి ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేశారు. మండలంలోని అరట్లకట్ట, జెడ్ భావారం, పెనగుదురు, యండమూరు, గొర్రిపూడి, కరప తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములు సేకరించారు. అలాగే గురజనాపల్లి గ్రామస్తులకు కరప సెంట్రల్ లే అవుట్‌లో పట్టాలిచ్చారు. పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు తమ గ్రామానికి దూరంగా ఉందన్న కారణంతో ఎవరూ అక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాలేదు. గ్రామంలోనే పట్టాలివ్వాలని గ్రామకమిటీ నాయకులు, గురజనాపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన స్పందించి గురజనాపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న 11.20 ఎకరాల సాల్ట్ భూముల్లో జగనన్న కాలనీ రూపొందించారు. గ్రామానికి చెందిన 581 మందికి 60 గజాల వంతున స్థలాలు కేటాయించి అందజేశారు.

అర్హులందరికీ పట్టాలు



గురజనాపల్లి లబ్ధిదారులు కరప సెంట్రల్ లేఅవుట్‌లో ఇచ్చిన పట్టాలను ఇష్టపడక పోవడంతో ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో సాల్ట్‌భూములు కొనుగోలు చేసి నిబంధనల మేరకు విశాలమైన రోడ్లతో ప్లాట్లను విడదీసి, జగనన్న కాలనీ రూపొందించి పట్టాలిచ్చాం.

– యాళ్ల సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు, కరప మండలం

సాల్ట్ భూముల కొనుగోలు ఒక చరిత్ర



కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సాల్ట్‌భూముల సేకరణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కన్నబాబు ఒప్పించి అంగీకరింపజేయడం ఒక చరిత్ర. ఆయన కేంద్ర ప్రభుత్వం, సాల్ట్‌శాఖాధికారులతో సంప్రదించడం ద్వారా లబ్ధిదారునికి రూ.8 లక్షల విలువైన ఇంటిస్థలం ఇచ్చి పేదల సొంతింటి కలసాకారం చేశారు.

– పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరపమండలం.

బాలాత్రిపుర సుందరి ఆలయ హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను బుధవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. మూడు నెలలు వ్యవధికి రూ.3.75 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఆలయ కమిటీ సభ్యులు, బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మత్స్యకార ప్రతినిధులు

- లేదంటే నీవు తప్పుకుంటావా?
- కొండబాబుపై పరువునష్టం దావా వేస్తా
- ఎమ్మెల్యే ద్వారంపూడి ధ్వజం

కాకినాడ సిటీ: మత్స్యకారులకు ఓఎన్‌జీసీ అందించే నష్టపరిహారానికి సంబంధించిన రూ.వెయ్యి కోట్లు తమ ఖాతాలో జమ చేశారని టీడీపీ నాయకుడు వనమాడి కొండబాబు చేసిన ఆరోపణలను రుజువు చేస్తే తాను రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానని, లేకుంటే రాజకీయాల నుంచి తప్పుకోవడానికి నీవు సిద్ధమా అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సవాల్ విసిరారు. బుధవారం కాకినాడ వెంకటనగర్‌లోని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో కొండబాబు చేసిన ఆరోపణ రుజువు చేయాలని, లేని పక్షంలో అతనిపై పరువునష్టం దావా వేయనున్నట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి వివరించారు. మంగళవారం కొండబాబు కొందరు మత్స్యకారులతో కలెక్టరేట్ వద్ద ఆందోళనకు వెళ్లాడని, అయితే అతని కూడా ఉన్న మత్స్యకారులు స్థానికులు కాదని, ఉప్పాడ మొదలు కొని ఉప్పలంక వరకు ఉన్న మత్స్యకారులు ఓఎన్‌జీసీ సిస్మిక్ సర్వే వల్ల నష్టపోతున్నారని, వీరిని ఆదుకునేందుకు వీలుగా ఓఎన్‌జీసీపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఓఎన్‌జీసీ సర్వే వల్ల తాము నష్టపోతున్నామని, సర్వే ఆపాలని 18 రోజులుగా ఆందోళన చేసినపుడు ఎందుకు రాలేదన్నారు. నూరు శాతం మత్స్యకార కుటుంబాలకు ఓఎన్‌జీసీ ఆర్థికసాయం చేస్తోందన్నారు. సిస్మిక్ సర్వే వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారని గ్రహించి అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఆందోళన చేశామని, ఒక దశలో సంస్థ కార్యకలాపాలు ఆపేందుకు సముద్రంలోకి వెళ్లినట్టు తెలిపారు. మలేసియా నుంచి పెద్ద ప్లాంట్ వచ్చిందని దాన్ని కూడా ఆపేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ఈ ఆందోళనను గుర్తించి ఓఎన్‌జీసీ అధికారులు ఢిల్లీ నుంచి వచ్చి కలెక్టర్ కృతికా శుక్లాతో సమావేశమై సాధ్యాసాధ్యాలపై కమిటీ వేశారన్నారు. ఓఎన్‌జీసీ, రిలయన్స్, జీఎస్‌పీసీ వంటి సంస్థలు సీఎస్సార్ నిధులు ఇచ్చి ముందుగా మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి చేసి తరువాత ఇతర ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. 2014-19 మధ్య ఓఎన్‌జీసీ వల్ల మత్స్యకారులు చాలా నష్టపోయారని గుర్తించి పోరాటం చేస్తున్నామన్నారు. ఉప్పలంక నుంచి ఉప్పాడ వరకు ఉన్న మత్స్యకార కుటుంబాలకు అభివృద్ధి, సంక్షేమానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. మత్స్యకారులు ఇకపై నష్టపోనివ్వబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చదువులేని కొండబాబు కూడా ఆందోళనకు వెళ్లిన వారంతా పండి, పోరా, తదితర గ్రామాల నుంచి వచ్చిన వారే తప్ప స్థానికులు ఎవరూ లేరన్నారు. ఏ కారణం చేతనైనా మత్స్యకారులకు నష్టపరిహారం అందకపోతే దానికి కొండబాబే కారణమవుతాడని ఎమ్మెల్యే ద్వారంపూడి అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు కొండబాబు అవినీతిని ప్రజలల్లో ప్రచారం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఓఎన్‌జీసీ సంస్థ మత్స్యకారులకు తప్పకుండా నష్టపరిహారం అందిస్తుందని, రాకపోతే మళ్లీ ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మత్స్యకార నాయకుడు వాసుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుపానుకు చిక్కి.. కష్టంగా ఇంటికి..

- అవస్థ పడి క్షేమంగా చేరిన ఉప్పలంక మత్స్యకారులు
- మూడు బోట్ల గల్లంతు

కరప: మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన 12 మంది మత్స్యకారులు తుపాన్‌లో చిక్కుకుని అతి కష్టం మీద ఒడ్డుకు చేరారు. కాగా వేటకు వెళ్లిన వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయా కుటుంబాల వారు ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉప్పలంక గ్రామానికి చెందిన 12 మంది మత్స్యకారులు బుధవారం మూడు బోట్లలో సముద్రంలోకి వేటకెళ్లారు. తుపాను కారణంగా సముద్రంలో మూడు బోట్లు మునిగిపోగా 12 మంది క్షేమంగా బయటపడ్డారు. వెళ్లిన వారంతా క్షేమంగా ఇళ్లకు చేరినట్టు ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ తెలిపారు. మునిగిపోయిన బోట్ల విలువ ఒకొక్కటీ రూ.4 లక్షలు ఉంటుందని, బాధితులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సతీష్ అధికారులను కోరారు.

సీతారామ విగ్రహ ప్రతిష్ఠ

కాకినాడసిటీ: రూరల్ మండలం తూరంగి పగడాల పేటలో బుధవారం సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉప్పలంక మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.50 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్, శ్రీ రామాంజనేయ ఆలయ అభివృద్ధి సంఘం సభ్యులు గెదెల అబ్బులు, వెంకటరమణ, చెక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఏపీఐఐసీ డైరెక్టర్ బసవా



ఎమ్మెల్యే కన్నబాబుతో అశోక్

కాకినాడ రూరల్: రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీసీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును బుధవారం ఏపీఐఐసీ డైరెక్టర్ బసవా అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమితులైన అశోక్ బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కన్నబాబును కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా శ్రీ, భూ సమేత వేంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



వేళంగిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు

కరప: నియోజకవర్గ పరిధిలో 125 ఆలయాలను అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో కొత్త ఆలయాలను, మరి కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన ఆలయాలను పునర్నిర్మించినట్టు తెలిపారు. వేళంగిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠను భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, సానా శ్రీను, అరుణ దంపతులు, చంద్రు హరిబాబు, మార్ని సుబ్రహ్మణ్యచౌదరి, బొండుపోగుల పాపారావు తదితర 15 మంది దంపతులు పీటలపై కూర్చోగా వేదపండితులు పూజాదికాలు నిర్వహించి, శాంతికళ్యాణం జరిపారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. వేళంగి, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

వీరభద్రుని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోపుశెట్టి బాబ్జీ, రంగబాబు, తోటకూర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుమారస్వామి కల్యాణం



కుమారస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు


బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుమారస్వామి వారి దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత కుమారస్వామి వారికి పాంచాహ్నిక దీక్షతో స్మార్త ఆగమ ప్రకారం కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. స్వామి వారికి ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం జరిగిన కల్యాణోత్సవం కన్నుల వైకుంఠంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నగరంలో వడగళ్ల వాన

- ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ వృక్షాలు
- జగన్నాథపురంలో బైక్‌లపై కూలిన వృక్షం



కాకినాడ బాలత్రిపుర సుందరి ఆలయంలో నేలకొరిగిన మామిడి చెట్టు



పగడాలపేటలో కురిసిన వడగళ్లు

బోట్‌క్లబ్: నగరంలో బుధవారం ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులు మొదలయ్యాయి. సాయంత్రం ఐదు గంటలకు ఒక్కసారిగా హోరున వాన కురిసింది. కాకినాడ పగడాలపేటలో వడగళ్ల వాన కురిసింది. దీంతో ఆ ప్రాంత వాసులు వాటిని పట్టుకుని ఆనందంతో సందడి చేశారు. సుమారు 20 నిమిషాలకు పైగా వాన కురవడంతో పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డుపై ప్రవహించింది. ఈదురుగాలుల నేపథ్యంలో సుమారు గంటకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరవాసులు ఇబ్బంది పడ్డారు. స్థానిక జగన్నాథపురంలోని సామా పబ్లిక్ స్కూల్ సమీపంలో ఈదురుగాలుల వల్ల చెట్టు నేలకొరగడంతో పక్కనే ఉన్న రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న భారీ మామిడి చెట్టు నేలకొరిగింది. భారీ గాలులకు చెట్టు ఒక్కసారిగా గోడపై కుప్పకూలిపోయింది. అయితే ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈదురుగాలుల వల్ల పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది రహదారులపై వెళ్లే వారికి ఇబ్బందులు లేకుండా వాటిని తొలగించారు.

ఉరుములతో చిరు జల్లులు

కాకినాడ రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో వాతావరణం చల్లగా మారింది. బుధవారం ఉదయం నుంచి చల్లగా ఉన్న వాతావరణం సాయంత్రం నుంచి పూర్తిగా మారిపోయింది. కాకినాడ రూరల్‌లో ఉరుములతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. వరి చేలు పొట్ట, ఈనిక దశలో ఉండడంతో ఇబ్బంది లేదని వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ తెలియజేశారు. సముద్రం నుంచి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు తమ బోట్లతో ఒడ్డుకు చేరుకుంటున్నారు.

కరప మండలంలో..

కరప: మండలంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కుండపోతగా వడగళ్ల వాన పడటంతో జనజీవనం స్తంభించింది. నడకుదురు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టుకూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామానికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించిపోయింది. కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గురజనాపల్లి, నడకుదురు, పెనుగుదురు పరిసర గ్రామాల్లో 18 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగి, దెబ్బతిన్నంటు కరప సబ్ స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేయించి, రాత్రి 9 గంటలకల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పడిపోయిన స్తంభాలను గురువారం సరిచేస్తామని ఏఈ తెలిపారు. ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోయి, పంటదెబ్బతిన్నట్టు మామిడిరైతులు నల్లా అన్నవరం, సత్తిబాబు తెలిపారు. వడగండ్లవానకు మామిడిపంట పక్వదశలో డాగులు ఏర్పడి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రబీపంట ఈనిక, పాలుపోసుకునే దశలో ఉందని, ఈదురు గాలులకు పువ్వారం రాలిపోయి, డిప్పలలో నీరుచేరి పంటకు నష్టం కలుగుతుందని రైతులు వెలుబంట్ల రవినాయుడు, నక్కా వీరభద్రరావులు తెలిపారు.



నడకుదురులో రోడ్డుపై చెట్టుపడడంతో నిలిచిపోయిన ట్రాఫిక్



జగన్నాథపురంలో బైక్‌పై కూలిన వృక్షం



కాకినాడలో హోరున కురుస్తున్న వర్షం